ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
3★★
ఆదివారం 28 జనవరి 2024





గుడి, బడి ఈ రెండూ లేని ఊరు అసలు ఉండదేమో అనుకుంటాం. కనీసం ఊహించుకోడానికి కూడా ఇబ్బందిగా ఉంది కదూ. కానీ ఈ ఊళ్లో ఉన్న సర్కారు బడి మాత్రం దాదాపు రెండేళ్లుగా మూత పడింది. ఊరికి దూరం కావడంతో కొందరు పిల్లలను బడికి పంపడం మానేసారు. రాను రాను విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. దీంతో ఆ బడిలో ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు డిప్యూటేషన్ పైన మరో చోటకు వెళ్లడంతో ఇంకేముంది పాఠాలు చెప్పే వారు కూడా లేకుండా పోవడంతో మెల్లి మెల్లిగా బడికి తాళం పడింది. పైసలున్నోళ్లు పక్క ఊర్లో చదువుకుంటున్నారు. పైసలు లేనోళ్లు మాత్రం పక్క ఊర్లోని సర్కారు బడికి పంపుతున్నారు. ప్రభుత్వ లక్ష్యం కోసం యేటా బడిబాట నిర్వహించే విద్యాశాఖ అధికారులకు మాత్రం ఇక్కడి మూత పడ్డ బడి కానరాకపోవడం గమనార్హం.

మూతబడింది..

● గ్రామంలో పాఠశాల లేక చిన్నారుల ఇక్కట్లు ● పట్టించుకోని పాలకులు, అధికారులు

బీర్‌పూర్, జనవరి 27 : బీర్‌పూర్ మండలంలోని రంగాసాగర్ గ్రామంలో గతంలో ఊరికి దూరాన పాఠశాల ఉన్నప్పుడు 20 మంది వరకు ఐదవ తరగతి విద్యార్థులు ఉండేవారు. ఊళ్లో ఉన్న గోదావరి ఒడ్డున గ్రామస్థులు అందరూ నివసించే వారు. గ్రామస్థులందరికీ కూడా పాఠశాల దగ్గర్లోనే ఉండేది. కానీ గోదావరి నీటి మట్టం పెరిగి ఎక్కడ ఇబ్బందులు ఎదురవుతాయోనని రాను రాను గ్రామస్థులు వారి మకాంను గోదావరికి దూరంగా ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పాఠశాల గ్రామానికి దూరం కావడంతో చిన్నారులను బడికి పంప కుండా తల్లిదండ్రులు కొంత కాలంగా ఇంటివద్దే ఉంచా రు. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతూ వచ్చింది.

ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కొల్వాయి గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలో విధులు నిర్వహిస్తూ గ్రామంలో పాఠశాలకు వెళ్లని విద్యార్థులను పోగు చేసి ప్రైవేటు పాఠశాల వైపు మళ్లించారు. విషయం తెలియడంతో గ్రామ సర్పంచ్ బోడ స్వప్న సాగర్ ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల బస్సులు గ్రామంలోనికి రాకుండా అడ్డుకున్నారు. ఆ సమయంలో ప్రస్తుత పాఠశాల ఊరికి దూరంగా ఉండటంతో గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో కొంత కాలం ఇల్లును అద్దెకు తీసుకొని పాఠశాలను కొనసాగించారు. దీనికి తోడు కరోనా రావడం ఆన్‌లైన్ తరగతులు ప్రారంభం కావడంతో అటు విద్యార్థులు, తల్లిదండ్రులు నిరుత్సాహంతో మళ్లీ ప్రైవేటు పాఠశాలలకే చిన్నారులను పంపించడం ప్రారంభించారు.

దీంతో రంగసాగర్ పాఠశాలకు కేటాయించిన ఉపాధ్యాయులు వెంకట రమణ, అనీల్‌లను డిప్యూటేషన్‌పై ఒకరిని కండ్లపల్లి మరొకరిని రగుబా పాఠశాలలకు పంపించడంతో పాఠశాల పూర్తిగా మూత పడిపోయింది. ఆర్థికంగా ఉన్న కుటుంబాలకు చెందిన సుమారు 40నుంచి 50 మంది చిన్నారులను వారి తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలకు పంపగా ఆర్థికంగా వెనుకబడిన కొందరు బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాలకు ఆటోలో పంపుతున్నారు. గ్రామంలో 163 కుటుంబాలు ఉండగా 523 జనాభా ఉంటారు. అందులో 383 మంది ఓటర్లు ఉంటారు ఒక గ్రామ పంచాయతీ పరిధిలో కనీసం పాఠశాల లేకపోవడంపై పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవ చూపి రంగాసాగర్‌లో ఎంతో ఇబ్బంది పడుతూ పొరుగు గ్రామాలకు వెల్లుతున్న చిన్నారులపై దృష్టి సారించి ప్రత్యేకంగా పాఠశాలను ఏర్పాటు చేసి ఈ గ్రామ పాఠశాలకు కేటాయించిన ఉపాధ్యాయులను మళ్లీ గ్రామానికి పంపి విద్యార్థుల కష్టాలు తీర్చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బడి లేక పేద పిల్లలకు ఇబ్బందిగా ఉంది..

రంగసాగర్ గ్రామస్థుడు ప్రశాంత్

ఆర్థికంగా లేని నిరుపేద కుటుంబాల పిల్లలకు చదువుకోవడానికి చాల ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో పాఠశాల లేక ఆటో కిరాయికి తీసుకొని ప్రతి రోజు బీర్‌పూర్‌కు ప్రభుత్వ పాఠశాలకు పంపుతున్నారు. మండల స్థాయి అధికారులు గ్రామంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలో మళ్లీ ప్రభుత్వ పాఠశాల ప్రారంభం అయ్యేలా చూడాలి.



రంగసాగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

గ్రామస్థులు సహకరించాలి..

: ఎంఈవో భీమయ్య



గ్రామ ప్రజలు సహకరించి విద్యార్థులను ప్రైవేటు పాఠ శాలలకు పంపించకుండా గ్రామంలోని పాఠశాలకు పంపి స్తే ఇద్దరు ఉపాధ్యాయులను ప్రతి రోజు వచ్చే ఏర్పాట్లు చేస్తాం. గ్రామంలో పాఠశాల లేకపోవ డంతో పేద పిల్లలకు అన్యాయం జరుగుతోంది. గతంలో చాలా వరకు ప్రయత్నించాము. పిల్లల తల్లిదండ్రులు సహకరిండం లేదు.

గతంలో ప్రైవేటు బస్సులు రాకుండా అడ్డుకున్నాం..

రంగసాగర్ సర్పంచ్ బోడ స్వప్న



గతంలో గ్రామంలోనికి వచ్చే ప్రైవేటు బస్సులు రాకుండా అడ్డుకున్నాము. కొన్ని రోజుల వరకు పంపించకుండా ఉన్నారు. మళ్లీ పంపించడం ప్రారంభించారు. మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారులు చొరవ చూపి మా గ్రామంలో మళ్లీ పాఠశాల పునఃప్రారంభం అయ్యేలా చూడాలి.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు

జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ సురేశ్ కుమార్


జగిత్యాలలో ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న జేడీఏ సురేశ్ కుమార్

జగిత్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కృతిమ ఎరు వుల కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ సురేశ్ కుమార్ అన్నారు. శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఎరువుల దుకాణాల తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో 355 ఎరువుల దుకాణాలుండగా ఇప్పటివరకు 212 దుకాణాల్లో నిల్వలను అధికారులు తనిఖీ చేశారన్నారు. వివరాల ను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అందిస్తున్నామని తెలిపారు. ఎరువుల లెక్కలు పక్కాగా ఉండేం దుకు ప్రభుత్వం ప్రవేశపెట్టి ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నామని తెలిపారు. పాయింట్ ఆఫ్ సేల్స్ యంత్రం లోని వివరాలతో పాటు ఎరువుల ఫొటోలను సైతం సేకరిస్తున్నామని వివరించారు. ప్రస్తుతం జిల్లాలో యూరియా కొరత లేదన్నారు. జిల్లాలో 10,204 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలున్నాయని తెలిపారు. ఇందులో పీఏసీ ఎస్‌లలో 1,915 మెట్రిక్ టన్నులు, ఏఆర్ ఎస్‌కేలలో 264 మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్‌లో 5,850 మెట్రిక్ టన్నులు, ప్రయివేటు డీలర్ల వద్ద 2,175 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని స్పష్టం చేశారు. వ్యాపారులు కృతిమంగా కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లా కేంద్రంలో మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలి

జగిత్యాల అర్బన్, జనవరి 27: ఇంటర్ పబ్లిక్ పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 ఆధ్వర్యంలో ఇంటర్ నోడల్ అధికారి నారాయణకు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం కరీంనగర్‌లో ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ నిర్వహిస్తున్నారని, జిల్లా పరిధిలోని 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్ అధ్యాపకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలో స్పాట్ వాల్యుయేషన్ సెంటర్ ఏర్పాటు చేయడానికి వసతులు ఉన్నాయన్నారు. 2023 ఇంటర్ ప్రాక్టికల్స్, వార్షిక పరీక్షలు, సప్లమెంటరీ పరీక్షల్లో విధులు నిర్వహించిన పలువురు అధ్యాపకులకు పెండింగ్‌లో ఉన్న పారితోషికాలను చెల్లించాలన్నారు. అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, మహిళా కార్యదర్శి శ్రీలత ఉన్నారు.



జగిత్యాలకు చేరుకున్న సీతమ్మ తల్లి ఓడిబియ్యం

జగిత్యాల టౌన్, జనవరి 27: అయోధ్య నుంచి సీతమ్మ తల్లి ఓడిబియ్యం శనివారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఉన్న రామాలయానికి చేరుకున్నాయి. కథలాపూర్ మండలం దుంపెట గ్రామానికి చెందిన రమేష్, పవన్, పరమేష్, శివ అనే నలుగురు యువకులు 21 రోజుల పాటు దీక్షలో ఉండి వడ్ల గింజలను స్వయంగా చేతులతో ఒలిచి బియ్యంగా మార్చి అయోధ్యకు తీసుకవెళ్లి సీతమ్మ తల్లికి సమర్పించారు. ఈ సందర్భంగా జగిత్యాలకు ఓడిబియ్యం తీసుకువచ్చిన స్వాములకు స్థానిక భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, భక్తులు ఉన్నారు.

జాతీయ స్థాయి సెమినార్‌కు ఆహ్వానం

జగిత్యాల అర్బన్, జనవరి 27: నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఢిల్లీవారు ఏటా జనవరిలో నిర్వహించే జాతీయ స్థాయి సెమినార్‌కు టీఆర్‌నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అబాకస్ నిపుణుడైన అడ్లగట్ల గంగాధర్ ఎంపికయ్యారు. జనవరి 29 నుంచి 31 వరకు స్కూల్ లీడర్షిప్ విభాగం యందు సెమినార్ నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో టీచింగ్ లెర్నింగ్ ప్రాసెస్ డెవలపింగ్ ఫింగర్ అబాకస్ మ్యాథమెటికల్ మిషన్ ఫర్ సుప్రీం విజన్ సెమినార్ ప్రెసెంటేషన్ పేపర్ సమర్పించనున్నారు. ఈ సందర్భంగా డీఈవో జగన్మోహన్ రెడ్డి, సెక్టోరియల్ అధికారి రాజేష్‌తో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, సహచరులు గంగాధర్‌ను అభినందించారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్



అయోధ్య గ్రామంలో గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని వాల్మీకి ఆవాసంలో సేవా భారతి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమ ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కుట్టు శిక్షణను పూర్తి చేసుకున్న మహిళలు, యువతులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, రాధిక దంపతులను నిర్వాహకులు శాలువలతో ఘనంగా సత్కరించారు. నాయకులు టీవీ సూర్యం, అశోక్ రావు, జిడిగె పురుషోత్తం, ధనుంజయ్, వెంకటేశ్వర్ రావు, మల్లేశం పాల్గొన్నారు.

కేసీఆర్ నిర్ణయాల వల్ల రాష్ట్రంలో ఎరువుల కొరత లేదు

రాయికల్: కేసీఆర్ నిర్ణయాల వల్ల రాష్ట్రంలో నేడు ఎరువుల కొరత లేదని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ మండలంలోని అయోధ్య గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల గోదాంలు ఉంటే నేడు 25 లక్షల మెట్రిక్ టన్నుల గోదాంలు నిర్మించుకున్నామని తెలిపారు. నాస్కబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కృషితో రాష్ట్రం కో సొసైటీల బలోపేతం చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయాల వల్ల 3 లక్షల ఎకరాల్లో పంట సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందన్నారు. జడ్పీటీసీ అశ్విని జాదవ్, పీఏసీఎస్ చైర్మన్‌లు రాజలింగం, మల్లారెడ్డి, రాజరెడ్డి, ముత్యం రెడ్డి, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, సర్పంచ్ జీవన్‌రెడ్డి, ఎంపీ టీసీ రానవేణి భారతరవీందర్, ఉప సర్పంచ్ రవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవయ్య పాల్గొన్నారు.

●రాయికల్‌లో గుర్రాల వేను సోదరుడు గుర్రాల ప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను, కిష్టంపేట గ్రామానికి చెందిన మంగలారపు చిన్న మల్లయ్య ప్రమాదవశాత్తు గాయపడగా వారిని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, సర్పంచ్ జాన స్వరూపగోపి, ఎంపీటీసీ సారికగంగాధర్ ఉన్నారు.

జగిత్యాలరూరల్: గ్రామపంచాయితీల అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ నిరంతర కృషి చేశారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల మండలంలోని పెరుకపల్లి బీఎల్ఎన్ గార్డెన్‌లో శనివారం సర్పంచులకు, ఉపసర్పంచులకు సన్మానసభను ఏర్పాటు చేశారు. జనవరితో పదవికాలం ముగుస్తున్న సందర్భంగా సర్పంచులు, ఉపసర్పం చులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌రాధిక దంపతులు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ ఘనంగా సత్కరించారు. సర్పంచులు, ఉపస ర్పంచులు గ్రామాలకు అందించిన సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మున్నూరుకాపు ఉద్యోగ సంఘం కార్యవర్గం ఏర్పాటు

ధర్మపురి, జనవరి 27: ధర్మపురి మండల మున్నూరుకాపు ఉద్యోగ సంఘం కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. స్థానిక గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం మున్నూరుకాపు ఉద్యోగ, ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. అనంతరం మండల గౌరవ అధ్యక్షులుగా బక్కశెట్టి మల్లేశం, మండల అధ్యక్షులుగా శీలం రాజేష్, ప్రధాన కార్యదర్శిగా అయ్యోరు వినోద్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా చల్ల గంగన్న, పులిశెట్టి సురేష్, కోశాధికారిగా బుక్క మహేష్, సంయుక్త కార్యదర్శిగా బి. రాజేష్, ప్రచార కార్యదర్శిగా బి. రవీందర్, కార్యదర్శిగా డి. గంగాధర్, బి. సతీష్‌ను ఎన్నుకున్నారు. సలహాదారులుగా చ ల్ల జనార్ధన్, ముత్తినేని సత్తయ్య, బండి మహేష్, కాశెట్టి రమేష్, నలు వా ల ప్రసాద్, పులిశెట్టి రాజేందర్, బలిజపెల్లి రాజేష్, కాశెట్టి శ్రీనివాస్, గడి పెల్లి కిరణ్, బండి ప్రవీణ్, గడిపెల్లి అభిషేక్, ఆకుల నాగరాజును ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి కృషి చేస్తూ సేవా కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు తీసు కువస్తామని తెలిపారు. కార్యవర్గాన్ని మున్నూరుకాపు ప్రజా ప్రజాప్రతిని ధులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు.

పల్లెకు పోదాం.. పేదల సంక్షేమాన్ని తెలుసుకుందాం

బీజేపీ రాష్ట్ర నాయకుడు రంజిత్ మోహన్


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు రంజిత్ మోహన్

కోరుట్ల, జనవరి 27 : 'గావ్ ఛలో.. బస్తీ ఛలో అభియాన్'లో భాగంగా నిర్వహిస్తున్న పల్లెకు పోదాం...పేదల సంక్షేమం పరిశీలిద్దామని బీజేపీ రాష్ట్ర నాయకుడు రంజిత్ మోహన్ అన్నారు. శనివారం పట్టణంలోని వాసవి కల్యాణ భవనంలో జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ రావుతో కలిసి గావ్ ఛలో.. బస్తీ ఛలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి వర్క్ షాప్‌ను నిర్వహించగా ముఖ్య అతిథిగా రంజిత్ మోహన్ పాల్గొని మాట్లాడారు. పదేళ్ల సమయంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకపోయి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా పరిధిలోని పలు మండల కేంద్రాలతో పాటు మున్సిపల్, మేజర్ గ్రామ పంచాయతీలలో వర్క్ షాపులను నిర్వహించి పేదల సంక్షమం, మహిళ సాధికారత పరిశీలించాలన్నారు. విదేశాలలో భారత దేశ గౌరవాన్ని పెంచుతూ దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ మరోమారు ప్రధాని అయ్యే విధంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ రావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న పథకాలను ప్రజలలోకి తీసుకోపోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పీసరి నర్సయ్య, రాగెల్లి సత్యం, యాదగిబాబు, చంద్రశేఖర్, దశరథ రెడ్డి, మరిపల్లి సత్యం, కస్తూరి సత్యం పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

మెట్‌పల్లి రూరల్: బీజేపీ శ్రేణులు వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడుగా రెండవ సారి ఏకగ్రీవంగా నియామకమైనా ఆయనను శనివారం పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి శాలువతో ఘనంగా సన్మానించి శుభకాంక్షలు తెలిపారు. బీజేపీ శ్రేణులతో జిల్లా అధ్యక్షుడు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిని గెలుపించుకోవడానికి ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. సన్మానించిన వారిలో పార్టీ కిసాన్ మోర్చా, యువమోర్చా మండలాధ్యక్షులు మారు జనార్ధన్‌రెడ్డి, పీసు రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి


విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ

జగిత్యాలరూరల్, జనవరి 27 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలికవసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని గుల్లపేట ప్రభుత్వ పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యా, విద్యార్థులు ఎదుర్కుంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గల కారణాలపై ఆరా తీశారు. పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు ఆలస్యంగా రావడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులే పాఠశాలకు ఆలస్యంగా వస్తే విద్యార్థులు ఎలా వస్తారని ప్రశ్నించారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించాల్సిన ఉపాధ్యాయులు ముందు క్రమ శిక్షణ కలిగి ఉండాలన్నారు. పాఠశాలలోని మూత్ర శాలల సమస్యను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లడంతో త్వరలో పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.

అనంతరం గ్రామంలో గల చెక్‌డ్యామ్, దెబ్బతిన్న రోడ్లను ఎమ్మెల్సీ పరిశీలించారు. మరమ్మతులకు అంచనా వ్యయం రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 27: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులతోపాటు చిన్నారికి తీవ్రగాయాల య్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వీర్నపల్లి మండలం భూక్య తండాకు చెందిన దంపతులు పద్మ- సురేశ్‌తోపాటు మూడు నెలల బాబు బైక్‌పై సిరిసిల్ల ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తున్నారు. సిద్దిపేటలో ఏఆర్ ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నిజామాబాద్ జిల్లాకు చెందిన లక్ష్మీనర్సాగౌడ్ కారులో ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తున్నాడు. హరిదాస్‌నగర్ బస్టాండ్ వద్ద బైక్‌ను కారు ఢీకొట్టడంతో పద్మ- సురేశ్‌తోపాటు బాబుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

30 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

వేములవాడ, జనవరి 27: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరా జేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 30వ తేదీ నుంచి త్యాగరాజ స్వామివారి ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నారు. త్యాగరాజ స్వామివారి 71వ ఆరాధనోత్సవాల నిర్వహణ కోసం ఆలయ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. జనవరి 30వ తేదీ మంగళవారం నుంచి ఫిబ్రవరి మూడవ తేదీ శనివారం వరకు ఐదు రోజులపాటు త్యాగరాజ స్వామి వారి ఆరా దనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ అధికారులు ఒక ప్రకట నలో తెలిపారు. ఉత్సవాలలో భాగంగా వివిధ ప్రాంతాలకు చెందిన కళాకా రులు సంగీత కచేరీలు, నృత్య ప్రదర్శనలతో కళాభిమానులను అలరిస్తారని వారు వెల్లడించారు.

రాజన్న క్షేత్రంలో కొనసాగుతున్న రద్దీ


క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

- మూడు రోజులపాటు గర్భాలయ ప్రవేశం రద్దు

వేములవాడ, జనవరి 27: వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోం ది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తమ ఇష్టదైవమైన శ్రీరాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకుని శ్రీస్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. బాలాత్రిపురాసుందరీదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమపూజ, కళాభవన్‌లో శ్రీస్వామివారి నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతం తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా వారు అమ్మ వారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించు కున్నారు. మేడారం సమ్మక్క, సారక్క జాతర సమీపిస్తున్న తరుణంలో గత కొద్ది వారాలుగా ప్రతినిత్యం వేలాదిమంది భక్తులు వేములవాడకు తరలివస్తున్న క్రమంలో రద్దీ మరింత పెరుగుతుండడంతో శని, ఆది సోమవారాలలో శ్రీస్వామివారి గర్భాలయ ప్రవేశాన్ని రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం, సోమవారం కూడా శ్రీ స్వామివారి గర్భాలయంలో అభిషేక పూజల భక్తులను అనుమతించమని ఆలయ అధికారులు వెల్లడించారు.

ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ


నరసింహుడి ఆలయంలోకి క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

ధర్మపురి, జనవరి 27: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. అభిషేకాది పూజలు, అర్చన లు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య పూజలు నిర్వహించారు. యాగశాల వద్ద లోక క్షేమార్థం నరసింహ హోమం జరిపారు. ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు కరీంనగర్‌కు హైకోర్టు న్యాయమూర్తుల రాక

కరీంనగర్ లీగల్, జనవరి 27: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, కరీంనగర్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ పి.శ్రీసుధ, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఇవి వేణుగోపాల్‌రావు కరీంనగర్ జిల్లా కోర్టుకు ఆదివారం రానున్నారు. కరీంనగర్ జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఐదవ అదనపు జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (జువైనల్ కేసులు) కోర్టు ప్రారంభోత్సవం చేయనున్నారు. వారితో పాటు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి ప్రతిమ, ఇతర న్యాయమూర్తులు పాల్గొననున్నారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధ్యక్షుడు బి.రఘునందన్‌రావు, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజులు ఒక ప్రకటనలో కోరారు.

రాజన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తులు


జస్టిస్ శ్రీనివాసరావుకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో

వేములవాడ, జనవరి 27: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మాధవిదేవి, జస్టిస్ శ్రీనివాసరావు దర్శించుకున్నారు. శనివారం వారు శ్రీ స్వామి వారి దర్శనం కోసం కుటుంబ సమేతంగా వేములవాడకు చేరుకున్నారు.ఆలయ అర్చకులు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ స్థానాచా ర్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు ఆశీర్వచనము గావించారు. ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్ శ్రీ స్వామివారి ప్రసాదం అందజే శారు. సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల జడ్జిలు ప్రేమలత, నీలిమ, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీవో మధుసూదన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

జాతరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు

- రాజన్న ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్

వేములవాడ, జనవరి 27: శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానం దత్తత ఆలయమైన కోనరావుపేట మండలం మామిడిపల్లిలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో ఫిబ్రవరి 9న నిర్వహించే మాఘ అమావాస్య జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ అన్నారు. ఆలయ అతిథి గృహంలో శనివారంనిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవస్థానం తరపున తగిన ఏర్పాట్లు చేస్తామని అన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు తగిన బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. సమావేశంలో వేములవాడ ఆర్డీవో పులి మధుసూదన్, కోనరావుపేట ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సెస్ వైస్ చైర్మన్ డి తిరుపతి, మామిడిపల్లి సర్పంచ్ కొక్కుల భారత నర్సయ్య, ఎంపీడీవో రామకృష్ణ, ఆలయ సూపరింటెండెంట్, శ్రీరాములు, ఆలయ ఇన్‌చార్జి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత్ సమ్మేళన్‌కు ఐదు రాష్ట్రాల కోఆర్డినేటర్‌గా ఎస్ కుమార్


ఎస్ కుమార్

గోదావరిఖని, జనవరి 27: బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో నా గపూర్, ఆగ్రాలలో జరగనున్న దళిత్ సమ్మేళన్‌కు ఐదు రాష్ట్రాల కోఆర్డినేటర్‌గా బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్‌నిర్మల్ లేఖ విడుదల చేశారు. నాగపూర్, ఆగ్రాలలో జరగనున్న కార్యక్రమాలకు 25వేల మంది ప్రతినిధులు హాజరయ్యేలా ప్రణాళికలు చేస్తున్నారు. అన్ని రాష్ట్రాల ఎస్సీ మోర్చా కమిటీలు, జిల్లా కమిటీలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు ఈ సమ్మేళన్‌కు హాజరుకానున్నారు. ఇందుకు గాను సమన్వయానికి బాధ్యతలు అప్పగించారు. ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి అయిన ఎస్ కుమార్‌కు ఏపీ, తెలంగాణ, పాండిచ్చేరి, కర్ణాటక, కేరళ, తమిళనాడు బాధ్యతలు అప్పగించారు.

భార్యను వేధించిన వ్యక్తికి జైలు శిక్ష

కరీంనగర్ లీగల్, జనవరి 27: అదనపు కట్నం కోసం భార్యను వేధించడమే కాకుండా, గుడిసెను తగులబెట్టిన కేసులో చెక్కల శివకృష్ణ (25) అనే వ్యక్తికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, 30 వేల రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు జడ్జి లక్ష్మీకుమారి శనివారం తీర్పునిచ్చారు. ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాత్మానగర్ చాపలకాలనీకి చెందిన దివ్య (21) అదే కాలనీకి చెందిన చెక్కల శివకృష్ణలు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. మూడు సంవత్సరాలు భార్యతో కలిసి కాపురం చేసిన శివకృష్ణ ఐదు లక్షలు అదనపు కట్నం కావాలని వేధించడంతో పాటు, 2022 అక్టోబర్ 10న అత్తమామలు నివాసం ఉండే గుడిసెను తగులబెట్టాడు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరు శ్రీరాములు సాక్షులను కోర్టులో హాజరుపరిచి విచారించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి శివకృష్ణకుక జైలు శిక్ష విధించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గంగాధర, జనవరి 27: గంగాధర మండలం రంగరావుపల్లికి చెందిన గంగాధర ప్రశాంత్(30) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గంగాధర ప్రశాంత్ డిప్లొమా పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాడు. ఈనెల 25న తనకు సమస్యలున్నాయట్లు గట్టుబూత్కూర్ శివారులో పురుగుల మందు తాగి తన అన్న ప్రవీణ్‌కు ఫోన్ చేశాడు. ప్రవీణ్ తన స్నేహితుడితో కలిసి వెళ్లి చూడగా గుర్తు తెలియని పురుగుల మందు తాగి పడి ఉన్నాడు. కరీంనగర్ తరలించి చికిత్స అందిస్తుండగా ఈ రోజు పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి లచ్చయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న రైతులు

మానకొండూర్, జనవరి 27: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో శనివారం మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లను రైతులు అడ్డుకున్నారు. అంబాల్‌పూర్ గ్రామానికి చెందిన 15 మంది రైతుల వ్యవసాయ భూములలో మట్టిని తీసుకునేందుకు గాను జాతీయ రహదారి నిర్మాణ కాంట్రాక్టర్ ఎకరానికి రూ. 68వేల ఒప్పందం కుదుర్చుకున్నారు. 45 రోజులకు నగదు చెల్లిస్తామని చెప్పి మూడు నెలలు దాటినా డబ్బులు ఇవ్వలేదని ఆగ్రహిస్తు టిప్పర్‌లను అడ్డుకొని నిరసన తెలిపారు. రోడ్డు పనుల సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని రెండుమూడు రోజుల్లో నగదు చెల్లిస్తామని చెప్పడంతో రైతులు వెళ్లిపోయారు.

జన సంద్రం

● కొండగట్టుకు పోటెత్తిన భక్తులు ● రోజంతా నిరంతర దర్శనం


దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు


కొండగట్టు ఆలయ పరిసరాల్లో భక్తులు

మల్యాల, జనవరి 27: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో పోటెత్తింది. కొండంతా భక్తజనంతో కిక్కిరిసింది. వచ్చే నెలలో జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతన నేపథ్యంలో ముందుగా దేవళ్లను దర్శించుకుంటుండగా వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. సీతమ్మ కన్నీటి గుంతల వరకు వరుస కట్టారు. ఆలయ పరిసరాలు, ఆలయ ప్రధాన కార్యలయం భక్తులతో నిండిపోయింది. వాహనాలను బొజ్జ పోతన్న ఆలయం వద్ద నిలిపివేశారు. ఘాట్‌రోడ్డు నుంచి కిందకు వచ్చే వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. భక్తులు ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. దాదాపు ముప్పై వేలకు పైగా భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో శ్రీనివాస్ ఇతర అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా నిరంతరంగా కొనసాగింది. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, బొజ్జపోతన పరిసరాలు నిండిపోయాయి.

పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయం

- జిల్లా విద్యాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 27: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు, పెద్దపల్లి జిల్లా విద్యాధికారి మాధవి, మంథనికి చెందిన ప్రవాసభారతీయుడు డాక్టర్ అశోక్ కాచే అన్నారు. శనివారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో బేసిక్ రిసెర్చ్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ (బ్రెడ్) సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో విద్యార్థులకు పుస్తక పఠనం, గ్రంథాలయ నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈవోలు మాట్లాడుతూ రాష్ట్రంలో 610 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 130 బాలల గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కాచే సేవలను కొనియాడారు. ఈసమావేశంలో బ్రెడ్ సొసైటీ ఉపాధ్యక్షులు విజయ్ సాయి మేఖ, శశి భూషణ్ కాచె, శ్రీనివాస్ కాచె, వరహాల శ్రీనివాస్, 80 పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై మోసం చేసిన వ్యక్తిపై కేసు

మెట్‌పల్లి, జనవరి, 27: మెట్‌పల్లి పట్టణ అనుసంధ గ్రామైనా వెంకట్‌రావుపేట గ్రామానికి చెందిన యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్‌రావుపేట గ్రామానికి చెందిన వివాహితకు కొంతకాలం క్రితం వివాహమైంది. అనంతరం విడాకులు తీసుకుని ఇంట్లోనే ఉంటోంది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో నిజామాబాద్ జిల్లా నవీపేట్ గ్రామానికి చెందిన ఈశ్వర్ అను వ్యక్తి రెండేళ్ల క్రితం పరిచయమయ్యాడు. కాగా కొన్ని రోజుల నుంచి వీరి మధ్య ప్రేమాయణం కొనసాగింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఈశ్వర్ ఆమె వద్ద నుంచి లక్ష రూపాయల వరకు తీసుకున్నాడు. కొద్ది రోజులుగా పెళ్లి చేసుకోవాలని వివాహిత కోరుతున్నా మాట దాటువేస్తూ కాలం వెళ్లదీసాడు. దీ తో మోసపోయినట్లు గుర్తించిన వివాహిత ఈశ్వర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్‌పై వచ్చి పుస్తెలతాడు దొంగిలించిన ఇద్దరి రిమాండ్


పోలీసులకు రివార్డు అందజేసిన ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 27: బైక్‌పై వచ్చి పుస్తెలతాడు దొంగిలించి పరారైన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని పెద్దగుండవెల్లికి చెందిన బోదాసు నరేశ్ (30), పద్మనాభంపల్లికి చెందిన సిద్ధన యాదవ్వ (33)ను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన రుద్రాపు పోషవ్వ అనే వృద్ధురాలు జ్వరంతో బాధపడుతూ ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని జంట బైక్‌పై వచ్చింది. ఇంటివద్ద దింపుతామని నమ్మించి ఆమె మెడలోని పుస్తెల తాడును తెంపుకొని పారిపోయింది. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ విచారణ చేపట్టారు. ప్రత్యేక బృందం ద్వారా జిల్లెల్ల, నేరెళ్ల, ముస్తాబాద్ ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. వాటి ఆధారంగా శుక్రవారం సాయంత్రం బద్దెనపల్లి క్రాస్‌రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న బోదాసు నరేశ్, సిద్ధన యాదవ్వను అదుపులోకి తీసుకొని విచారించగా దోపిడీ వ్యవహారం బయటపడింది. సులువుగా డబ్బులు సంపాదించవచ్చని దోపిడీలకు పాల్పడుతున్నట్లు వారు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు చెప్పే మోసపూరిత మాటలను నమ్మవద్దని అన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఆర్ఎస్సై జునైద్, కానిస్టేబుళ్ళ నరేందర్, రాజశేఖర్, శ్రీనివాస్, అక్తర్‌కు రివార్డు అందజేశారు.

ప్రారంభమైన జేఈఈ మెయిన్

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలు


విద్యార్థుల పత్రాలను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తిమ్మాపూర్/రామగిరి, జనవరి 27: దేశవ్యాప్తంగా వివిధ ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే తొలివిడ త జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ మెయిన్) పేపర్-1 పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రం, శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కరీంనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ అండ్ పీజీ, వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, వాణినికేతన్ డిగ్రీ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. రామగిరి మండలంలోని సెంటినరీకాలనీ జేఎన్‌టీయూలో జేఈఈ మెయిన్స్ ప్రవేశపరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 93 మంది, మధ్యాహ్నం 92 మంది పరీక్షలకు హాజరయ్యారు.ఉదయం 9 నుంచి 12గంటల మొదటి సెషన్‌లో 1,309మందికి 1,297మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. రెండో సేషన్‌లో మధ్యాహ్నం 3నుంచి 6గంటల వరకు 1,309 మందికి 1,301మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు ఫిబ్రవరి 1వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రెండు గంటల ముందు నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. విద్యా ర్థులను క్షుణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోనికి అనుమ తిం చామని ఎన్‌టీఏ సీటీ కోఆర్డినేటర్ లలిత కుమారి తెలిపారు.

స్వగ్రామం చేరుకున్న మృతదేహం

చందుర్తి, జనవరి 27: చందుర్తి మండల కేంద్రానికి చెందిన కైర నాగయ్య (55)అనే వ్యక్తి సౌదీ అరేబియాలో మృతి చెందగా శనివారం మృతదేహం స్వగ్రామానికి తీసుకొచ్చారు. నాగయ్య జీవనోపాధి కోసం 30 సంవత్సరాలుగా గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. 10 సంవత్సరాల క్రితం సౌదీ వెళ్లిన నాగయ్యకు 20 రోజులు క్రితం పక్షవాతం వచ్చింది. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు.

పశుగ్రాసం దగ్ధం

ఓదెల, జనవరి 27: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో శనివారం ఎంబాడి సమ్మయ్య అనే రైతుకు చెందిన పశుగ్రాసం కుప్ప నిప్పంటుకొని దగ్ధమైంది. రెండు నెలల క్రితం రైతు కొంత భూమిని కౌలుకు తీసుకుని వరి పంట వేసి పంటను పూర్తి చేసుకోగా అనంతరం మిగిలిన నాలుగు ఎకరాల గడ్డిని కుప్పగా పేర్చాడు. ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైంది. సమీపంలోని ప్రజలు అక్కడికి చేరుకుని నీరు పోసి మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది.

రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన కేసులో మరో ముగ్గురి అరెస్టు

హుజూరాబాద్, జనవరి 27: హుజూరాబాద్ పట్టణంలో నాలుగు రోజుల క్రితం రేషన్ బియ్యం అక్రమ నిల్వ చేసిన కేసులో పరారిలో ఉన్న ముగ్గురిని టౌన్ సీఐ బొల్లం రమేశ్ అరెస్టు చేసినట్లు ఏసీపీ జీవన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల క్రితం 250 క్వింటాళ్ల రేషన్ బియ్యం మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన కేసులో ఏ1గా ఉన్న శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామనరి చెప్పారు. కాగా పరారిలో ఉన్న ముగ్గురు బోర్నపల్లికి చెందిన పిల్లి శ్రీధర్, శంకరపట్నం మండలం మెట్‌పల్లికి చెందిన అంగిడి రమేష్, ఇల్లందకుంట మండలం మల్యాలకు చెందిన తిరుపతి సురేష్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

ఇసుక లారీల తనిఖీ

మంథని, జనవరి 27: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కూచిరాజ్‌పల్ల వద్ద మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి పై ఇసుకల లారీలను, టిప్పర్లను టీఎస్ఎండీసీ అధికారులు శనివారం రాత్రి తనిఖీ చేశారు. మంథని, ముత్తారం మండలాల్లోని వివిధ ఇసుక క్వారీల నుంచి రవాణా అవుతున్న ఇసుక లారీలు, టిప్పర్లను టిఎస్ఎండీసీ ఎస్ఆర్‌వోలు రాజుకుమార్, అరవింద్ తనిఖీలు చేపట్టారు.

క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, జనవరి 27: తెలంగాణ షార్ట్ ఫిలిం మేకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్-204ను మండలంలోని ఎల్ఎండీ కాలనీలో శనివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో 500లకు పైగా కళాకారులు, ఫిలిం మేకర్లు మంచి చిత్రాలు రూపొందిస్తూ దేశ వ్యాప్తంగా పేరు ప్రతిష్టలు సంపాదించడం సంతోషకరమన్నారు. క్రీడలు ఆరోగ్యానికి బాగా ఉపయోగపడతాయని చెప్పారు. కళాకారుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఎమ్మెల్యే సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ షార్ట్ మేకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అయిలు రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గన్నమనేని నర్సింగరావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి సీతామలక్ష్మి, ఇతర సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భార్యను కిడ్నాప్ చేశారంటూ భర్త ఫిర్యాదు

గొల్లపల్లి, జనవరి 27: మండలంలోని చెందోళి గ్రామంలో ఇంట్లో ఉన్న తన భార్య సౌమ్యను ఆమె కుటుంబ సభ్యులు మరికొందరు కలిసి అపహరించారని భర్త రేగుల రాకేష్ గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రేగుల రాకేష్, ఎనగందుల సౌమ్య ప్రేమించుకుని ఈ నెల 3వ తేదీన వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి ఇద్దరు కలిసి రాకేష్ ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో సౌమ్య తండ్రి ఎనగందుల చంద్రమౌళి, కట్కూరి రమేష్, దొనకొండ స్వామి ఇంటిలో ఉన్న సౌమ్యను బలవంతంగా తీసుకెళ్లారు.. భర్త రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్ 27: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17, 19 క్రీడాకారుల టగ్ ఆఫ్ వార్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చెంజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం ఉదయం 9 గంటలనుంచి ఈ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల క్రీడాకారులు ఫొటోతో కూడిన అర్హత సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. అండర్-19 క్రీడాకారులు పదో తరగతి మెమోలతో హాజరుకావాలని ఆయన తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరు వాహనదారులకు జైలు

కరీంనగర్ క్రైం, జనవరి 27: కరీంనగర్‌లో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరు వాహనదారులకు జైలు శిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. మోతాదుకు మించి మద్యం సేవించి తనిఖీలలో పట్టుబడిన 15 మంది వాహనదారులను శనివారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒకరికి 5 రోజులు, మరొకరికి 3 రోజులు జైలుశిక్ష, రూ.3,500లు విధించారని తెలిపారు. మరో 13 మంది వాహనదారులకు రూ.21,500లు జరిమానా విధించినట్లు తెలిపారు.

గల్ఫ్ పంపిస్తానంటూ మోసం

- ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుల నిరసన


మెట్‌పల్లిలో నకిలీ వీసాలు చూపుతున్న బాధితులు

మెట్‌పల్లి, జనవరి 27: విదేశాలలో జీవనోపాధి కల్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన గల్ఫ్ ఏజెంట్ యేలేటి రమేష్‌పై చర్యలు తీసుకోవాలని శనివారం బాధితులు ఆయన ఇంటి ఎదుట నిరసన తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో పనులు లేక ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లడానికి పట్టణంలోని యేలేటి రమేష్‌ను కొంత మంది సంప్రదించారు. సదరు ఏజెంట్ దుబాయ్‌కి పంపిస్తానని బాధితులు ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 60వేలు తీసుకొని వీసా కాపీలను ఇచ్చి పంపించాడు. వీసాలు తీసుకున్న బాధితులు ఎన్నో ఆశలతో దుబాయి వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బయల్దేరారు. తీరా అక్కడకు వెళ్లిన బాధితులకు అవి నకిలీ వీసాలని అధికారులు గుర్తించి తెలపడంతో షాక్‌కు గురయ్యారు. ఏజెంట్ చేతిలో మోసపోయినట్లు గుర్తించిన 40 మంది బాధితులు ఆగ్రహంతో ఏజెంట్ ఇంటికి చేరుకుని ఆందోళనకు దిగారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు అభినందనీయం

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల, జనవరి 27: మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శనివారం పట్టణంలోని అయిలాపూర్ దర్వాజ ప్రాంతంలో రంజిత్ యువ సేన సమితి సభ్యులు ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మహాత్ముడి నాయకత్వంలో అహింస మార్గంలో పోరాటం చేసి స్వాతంత్ర్యం సాధించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం, రుద్ర సుజాత - శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మచ్చ కవిత, తిరుమల గంగాధర్, నహిం, రంజిత్ యువ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం ఆవిష్కరిస్తున్న జువ్వాడి నర్సింగ రావు

పార్టీ బలోపేతానికి ప్రతీఒక్కరు కృషి చేయాలి

మెట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పిలుపు నిచ్చారు. శనివారం పట్టణంలోని పలువురు నాయకులు పార్టీలో చేరగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజలకు అండగా ఉండాలన్నారు. అదేవిధంగా పట్టణా నికి చెందిన మిరియాల లక్ష్మికాంతారావు సతీమణి మధురమ్మ, పోచంపల్లి ఆశమ్మలు మరణించగా వారి కుటుంబాలను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. కార్యక్రమాల్లో నాయకులు మార్గం గంగాధర్, మర్రి సహదేవ్, పిప్పెర రాజేశ్, చర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, అరిసే మురళి, తుమ్మనపల్లి రాంప్రసాద్, జక్కని కుందన్, పోతు సత్యనారాయణ, కంబ సురేష్, జెట్టి లక్ష్మణ్, షేక్ మహ్మద్, జెట్టి లింగం, అల్లూరి మహేందర్‌రెడ్డి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

రూ. 5 లక్షల విరాళం అందించిన దాతలకు ఘన సన్మానం



వృద్ధాశ్రమానికి విరాళం ఇచ్చిన దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలమ సంక్షేమ మండలి వృద్ధాశ్రమానికి రూ. 5 లక్షల విరాళాన్ని అందించిన మన్నెగూడెం గ్రామానికి చెందిన చెన్నమనేని సునీత- అమరేందర్‌రావు దాతలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, రాధిక దంపతులు ఘనంగా సన్మానించారు. స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో రూ. 5 లక్షల చెక్కును సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యాచమనేని వెంకటేశ్వర్ రావు, దన్నపునేని వేణుగోపాల్ రావులకు అందించారు. ఈసందర్భంగా దాతలు సునీత, అమరేందర్ దంపతులను శాలువలతో సత్కరించారు. వృద్ధాశ్రమ నిర్వహణకు చేయూతనందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమలాకర్‌రావు, జగిత్యాల వెలమ సంక్షేమ మండలి అధ్యక్ష, కార్యదర్శులు యాచమనేని వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి దన్నపునేని వేణుగోపాల్ రావు, కోశాధికారి దామోదర్‌రావు, ఉపాధ్యక్షులు సాగర్‌రావు, నాయకులు పురుషోత్తం, సురేందర్, దివాకర్, కాశీరావు, మురళీధర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల రూరల్, జనవరి 27: ఫిబ్రవరి 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే ఎన్ఎస్ఎస్ శిబిరాలను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ యూనివర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవరావు శనివారం కోరారు. జిల్లాలోని గొల్లపల్లి, సారంగాపూర్, మల్యాల, జగిత్యాల రూరల్, మేడిపల్లి, మల్లాపూర్ మండలలోని 21 గ్రామాలలో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు, నట్టల నివారణ మందు, పశువులలో గర్భధారణ పరీక్షలు, వివిధ శస్త్ర చికిత్సలు నిర్వహించి పశువులకు తీసుకునే జాగ్రత్తలను వివరించనున్నట్లు తెలిపారు. శిబిరాలను కలెక్టర్ యాస్మిన్ భాషా, పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ డీన్ డా. రఘునందన్ సందర్శించనున్నట్లు తెలిపారు. సుమారు 67 మంది వెటర్నరీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు, 20 మంది ప్రొఫెసర్లు శిబిరంలో పాల్గొనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన నాయకులు

మెట్‌పల్లి, జనవరి, 27: గవర్నర్ కోటలో ఎన్నికైన తెలంగాణ జన సమితి పార్టీ అధినేత ప్రొఫెసర్ కోదండరాంను పార్టీ కోరుట్ల నియోజక వర్గం ఇన్‌చార్జి, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సన్మానించి శుభకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వం అందజేసే పథకాలను అర్హులైన వారికి అందేలా చూడాలని ఎమ్మెల్సీ సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట శంకర్, సీనియర్ నాయకులు రెబ్బటి మల్లయ్యయాదవ్, విద్యార్థి నాయకుడు జిల్లపల్లి దిలీప్, రమేష్ ఉన్నారు.

మిషన్ భగీరథ నీరు రావడం లేదని వినతి

కథలాపూర్, జనవరి 27: తమకు గడిచిన ఐదు సంవత్సరాలుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని దీంతో సొంతంగా బోర్లు వేసుకుని నీరు వాడుకుంటున్నామని మండలంలోని ఇప్పపల్లి గ్రామస్థులు ఎంపీడీఓ జనార్దన్‌కు శనివారం వినతి పత్రం అందించారు. అధికారులను ఎన్నిసార్లు అడిగినప్పటికీ గేట్‌వాల్స్ చెడిపోయి, పైపులు లీకేజీ కావడం వల్ల నీటి సర ఫరాకు అంతరాయం కలుగుతోందని చెబుతున్నారన్నారు. కాంట్రాక్టర్ పైపులను మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాడని, గ్రామానికి నీళ్ల సరఫరా అవుతున్నట్టు మిషన్ భగీరథ అధికారులు నివేదికలు పంపుతున్నారని ఆరోపించారు. బోర్లు వేయించుకుని తాగునీటిని వాడుకుంటున్నా మని ఆవేదన చెందారు. మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లతో కలిసి తాను రెండు రోజుల్లో పర్యటిస్తానని ఎంపీడీవో గ్రామస్థులకు వివరించారు. మాజీ సర్పంచ్ జవిడి రవీందర్‌రెడ్డి, గ్రామస్థులు ఉన్నారు.

తాండ్ర్యాలలో నేడు మల్లికార్జునస్వామి జాతర

కథలాపూర్, జనవరి 27 : ఈ నెల 28న మండలంలోని తాండ్ర్యాలలో మల్లికార్జునస్వామి జాతర నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11 గంటలకు మేడలాంబ, కేతలాంబ సహిత మల్లికార్జునస్వామి కళ్యాణోత్సవం అర్చకులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 30న అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆచార సంఘం, గ్రామస్థులు తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిని సన్మానించిన పార్టీ శ్రేణులు

మెట్‌పల్లి, జనవరి, 27 : బీజేపీ జిల్లా అధ్యక్షుడుగా రెండవ సారి ఏకగ్రీవంగా నియామకమైన మోరపల్లి సత్యనారాయణరావును పార్టీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్ ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. శనివారం పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయనను శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సన్మానించిన వారిలో నాయకులు నవీన్, రఘు విజయ్ ఉన్నారు.

ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నాం

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్, జనవరి 27:ఇచ్చిన ప్రతీ హామీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని తాళ్లకొత్తపేట గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ప్రతీ నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బం దుల్లో ఉన్నప్పటికీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేసి తీరుతామన్నారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి పెంపు హామీలను అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి పేద ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి లింగయ్య, సర్పంచ్ ద్యావనపల్లి లక్ష్మీ ఎల్లయ్య, తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో సంజీవ్‌రావు, ఏఈపీఆర్ రాజ్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఎంపీటీసీ తిరుపతి, ఉప సర్పంచ్ సతీష్, అంజిరెడ్డి, గోపికృష్ణ పాల్గొన్నారు.

హామీలను తప్పక నెరవేర్చుతాం

ఎండపల్లి : ఎన్నికలలో సమయంలో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను నెరవేర్చుతామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తపేట గ్రామానికి నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామ సర్పంచ్‌తో కలిసి పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ..గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభించడం చాలా సంతోషకరమని, ఈ అవకాశం పదేళ్ల తరువాత తనకు నియోజకవర్గ ప్రజలు కల్పించినందుకు వారికి శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నా నని అన్నారు. తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు ఆపదలో అన్నను అవుతానని, ఏ ఆపద ఉన్నా నేరుగా తనను సంప్రదించాలన్నారు. పక్క నే గోదావరి ఉన్నా నియోజక వర్గ ప్రజల సాగు గురించి ఏనాడు పట్టిం చుకోలేదన్నారు. పదేళ్ల తరువాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని సాగునీటి సమస్యను సీఎం, మంత్రుల సహకారంతో పరిష్కరించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శైలెందర్‌రెడ్డి, సర్పంచ్ కొమ్ము రాంబాబు, రావు హన్మంతరావు, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎండపల్లి మండలం కొత్తపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

సీఎంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భేటీ

- రాజన్న ఆలయ అభివృద్ధి, నియోజకవర్గంలోని పలు సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయించాలని విజ్ఞప్తి



సీఎంకు సమస్యలు వివరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 27: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో వేములవాడ శాసనసభ్యుడు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భేటీ అయ్యారు. శనివారం హైదరాబాదులో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఆది శ్రీనివాస్ వేములవాడ సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలోని పలు ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నిధుల కేటాయింపు కోసం విజ్ఞప్తి చేశారు. వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండల ప్రజల తాగు, సాగునీటి సమస్య పరిష్కారం కోసం ఉపయోగపడే కలికోట సూరమ్మ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

వేములవాడ రూరల్ మండలం మర్రిపెల్లిలోని మర్రిపల్లి చెరువు, కోనరావుపేట మండలంలోని లచ్చపేట చెరువులను రిజర్వాయర్‌లుగా మార్చడానికి అవసరమైన నిధులు విడుదల చేయాలని సీఎంను కోరారు. భీమారం మండలం గోవిందారం చెరువులోకి పోతారం రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని విడుదల చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిధిలో ఎగువ మానేరు 9వ ప్యాకేజీ పనులు వెంటనే ప్రారంభిం చడానికి చొరవ చూపాల ని కోరారు. జిల్లాలో విద్యా రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, అగ్రహారం డిగ్రీ కళాశాలలో బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. దక్షిణ కాశీగా పేరు గాంచిన వేములవాడ రాజరాజే శ్వర స్వామివారి దేవస్థానం అభివృద్ధి, భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడం కోసం వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ సంస్థకు తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు. రాజన్న ఆలయంతో పాటు వేములవాడ పట్టణంలో మౌలిక వసతులు కల్పన పట్టణ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని, వేములవాడ పట్టణ అభివృద్ధి ఆలయ అభివృద్ధి తదితర అంశాలపై చర్చిం చేందుకు వీటీడీఏ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిపై చర్చించేందుకు వీటీడీఏ సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించారని, త్వరలోనే వీటీడీఏ సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. మిడ్ మానేరు ముంపు గ్రామాల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు, పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. వేములవాడ సిరిసిల్ల నియోజక వర్గం పరిధిలోని పలు సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు సానుకూలత వ్యక్తం చేశారని వివరించారు. రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి ప్రత్యేక సలహాదారులు వేం నరేందర్ రెడ్డి తదితరులను కలిసి జిల్లా అంశాలపై చర్చించినతట్లు ఆది శ్రీనివాస్ వెల్లడించారు.

గురువుకు పూర్వ విద్యార్థుల సన్మానం

గొల్లపల్లి, జనవరి 27: మండలంలోని మల్లన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 1995 బ్యాచ్‌లో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు గురువు నందయ్యకు సన్మానం చేశారు. అలాగే రూ.17 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రంగు శ్రీనివాస్, మానుక కన్నయ్య, కట్కూరి తిరుపతి, బొంకంటి తిరుపతి, పెంట శ్రీనివాస్, గుండా లక్ష్మణ్, నస్పూరి చంద్రయ్య, బండారి గంగాధర్, సైన్ తిరుపతి, గంగారెడ్డి, వెంకటేష్, ధనలక్ష్మి, గంగలక్ష్మి, అంజవ్వలు పాల్గొన్నారు.

చెరువు భూమి కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

గొల్లపల్లి, జనవరి 27: మండలంలోని రంగదామునిపల్లి శివారులో గల పెద్ద చెరువు కబ్జాకు గురి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిర్మలాపూర్ మత్స్యకార సంఘం సభ్యులు తహసీల్దార్‌కు మహ్మద్ ఆరిఫొద్దీన్‌కు వినతి పత్రం సమర్పించారు. చెరువు శిఖం భూమి మొత్తం 88 ఎకరాలు ఉందని, చెరువు భూమిని దావు తిరుపతి అనే రైతు వ్యవసాయ బావి తవ్వాడని పేర్కొన్నారు. అలాగే చెరువులో మట్టి పోసి భూమి కబ్జా చేశాడని అన్నారు. కావున చెరువుకు హద్దులు నిర్ణయించి తమకు న్యాయం చేయాలని కోరారు. మత్స్యకార సంఘం సభ్యులు మల్లయ్య, సంతోష్, సత్తయ్య పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

ధర్మపురి, జనవరి 27: మండలంలోని మగ్గిడి మోడల్ స్కూల్‌లో వచ్చే విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ముత్యపు బుచ్చన్న ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మపురి, బుగ్గారం మండలాల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడ వచ్చే విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇందులో 6వ తరగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10 వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం కూడ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. వారందరికి ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. వివరాల కోసం 9949015156, 8142575143 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మెట్‌పల్లి, జనవరి, 27 : రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అప్పుడే సురక్షితంగా గమ్యానికి చేరుకుంటారని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా శనివారం పట్టణంలోని ప్రయాణికులకు అవగాహన కల్పించి రోడ్డుపై ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణం చేస్తామని వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవొద్దని, వాహనాలు నడిపినప్పుడు హెల్మెట్ ధరించడం వంటి పలు సూచనలు చేశారు. రోడ్డుపై వాహనాలను పెద్ద శబ్దాలు చేయకుండా, ర్యాష్ డ్రైవింగ్ చేయవొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ఇతరులకు ఇబ్బందులకు గురిచేయకుండా ప్రయాణం చేయాలని లేనియెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధలను పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని, ఏదైనా జరగని ప్రమాదం జరిగితే కుటుంబాలు వీధిపాలై ప్రమాదం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ట్రాఫిక్, రోడ్డు భద్రతపై ఎస్.ఐ సీహెచ్. సతీష్ అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబందనలు పాటిస్తూ తోటి ప్ర యాణీకులందరికి కూడా భరోసా ఇస్తాను, రహ దారి భద్రత పట్ల అంకితభావంతో కృషి చేస్తాను అంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లలిత, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లి రూరల్, జనవరి 27: వాతావరణంలో జరుగుతున్న మార్పులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి అంజిత్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పాటిమీద తండా గ్రామంలో వైద్య శిబిరాన్ని సర్పంచు జరుపుల బుజ్జి-గోవింద్‌నాయక్‌ల మేరకు జగ్గసాగర్ ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం, ఆత్మకూర్ వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసి గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రతీరోజు రాత్రి వేళలో ఈదురు గాలులు మధ్యాహ్నం వెడి తీవ్రతతో ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నందున ప్రజలు నీటిని వేడి చేసి చల్లార్చుకొని తాగాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచు కోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణావేణి, సూపర్ వైజర్స్ అచ్యుత్‌రావు, ప్రభావతి, పంచయాతీ కార్యదర్శి రణధీర్, ఏఎన్ఎమ్ సుజాత, ఆశా వర్కర్స్ లక్ష్మి, లావణ్య, పద్మపాణి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ నాయకుల పరామర్శ

మెట్‌పల్లి రూరల్, జనవరి, 27 : మండలంలోని జగ్గసాగర్ గ్రామానికి చెందిన పుప్పాల గంగాధర్ తండ్రి, జంగిటి వెంకటనర్సయ్యలు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. శనివారం బాధిత కుటుంబాలను కలిసి వారి మృతి పట్ల సంతా పం తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ప్రభుత్వం తరపున పథకాలను అందేలా చూస్తానన్నారు. ఈయన వెంటా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పార్టీ కిసాన్‌మోర్చా మండలా ధ్యక్షుడు పిడుగు తిరుపతిరెడ్డి, ప్రశాంత్, జెట్టి లింగం, రాజేశ్వర్, రాజారెడ్డి, లింగారెడ్డి, గంగారెడ్డి, మోహన్, తదితరులు ఉన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

మండల సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల, జనవరి 27 : రైతులు ఆందోళన చెందవద్దని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ స్వర్ణలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గంలో గుంట భూమి ఎండిపోకుండా ఎల్లంపెల్లి నుంచి సాగు నీటిని అందిస్తానన్నారు. సంబంధిత అధికారులు ఆదివారం మధ్యాహ్నం వరకు నారాయణపూర్ చెరువుకు నీటిని తరలిస్తామన్నారు. రైతుబంధు నగదు 15 రోజుల్లో ఖాతాల్లో జమఅవుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను, సర్పంచులను మండల ప్రజాప్రతినిధులు సన్మానించారు. అంతక ముందు ఎంపీటీసీ లక్ష్మన్ మాట్లాడుతూ కొడిమ్యాల మండలానికి అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. డబ్బుతిమ్మయ్య పల్లి ఎంపీటీసీ జగన్‌మోహన్‌రెడ్డిమాట్లాడుతూ వడగళ్ల బాధితులకు నష్టపరిహారం ప్రభుత్వం అందించాన్నారు. కొడిమ్యాల సర్పంచు మమత నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఇందిరా నగర్ కాలనీ వాసులకు రేషన్ సరుకలను అందుబాటులోకి తీసక వచ్చి పంపిణీ చేయాలన్నారు. కొడిమ్యాల మండలానికి పల్లె ప్రగతి నిధులు సుమారు కోటిన్నర రూపాయల రావలిసి ఉందని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణారావు తెలిపారు. పూడూర్ మండలం ఏర్పాటుకు, రావికుంటను రాఘవరెడ్డి కుంట పేరు మార్పిడికి సమావేశం ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ ప్రశాంతి, ఎంపీడీవో పద్మజరాణి, తహసీల్దార్ రవికాంత్, సింగిల్ విండోల చైర్మనులు రాజనర్సింగరావు, రవీందర్‌రెడ్డి, రాజేందర్,వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను శనివారం జాతీయ సహకార బ్యాంకుల సమాఖ్య ముంబాయి అధ్యక్షుడు, రాష్ట్ర సహకార టెస్కాబ్, కేడీసీసీ కరీంనగర్ బ్యాంక్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలిసి ప్రారంభించారు. మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామంలో 20లక్షల రూపాయలతో నిర్మించు గోదాం నిర్మాణానికి భూమి పూజ చేశారు. మండల కేంద్రంలో 29 లక్షల 16 వేల రూపాయలతో నిర్మించిన కేడీసీసీ బ్యాంక్ స్ట్రాంగ్ రూం, రికార్డు గది, మండలంలోని తిర్మాలాపూర్ గ్రామంలో 20లక్షల రూపాయలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని. అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం నాచుపల్లి గ్రామంలో 26లక్షలతో నిర్మించిన దుకాణాల సముదాయాన్ని, 20లక్షల రూపాయలతో నిర్మించిన పల్లె దవాఖానను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ స్వర్ణలత, జడ్పీటీసీ ప్రశాంతి, సర్పంచులు మమతనర్సింహరెడ్డి, లతమల్లేశంయాదవ్, పద్మమల్లేశంయాదవ్, లత తిర్మలేష్‌యాదవ్, డీసీవో సత్యనారాయణ, సింగిల్ విండోల చైర్మన్లు పాల్గొన్నారు.

ఎల్లమ్మ పట్నాలకు రావాల్సిందిగా ఎమ్మెల్యేకు ఆహ్వానం

జగిత్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్‌గల్ గ్రామంలో వచ్చే నెల 6వ తేదీన నిర్వహించనున్న రేణుక ఎల్లమ్మ పట్నాలు, బోనాల జాతరకు రావాల్సిందిగా కోరుతూ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌కు పలువురు గౌడ సంఘ నాయకులు ఆహ్వానపత్రం అందించారు. పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను పలువురు గౌడ సంఘ నాయకులు కలిసి ఆహ్వానించారు. ఈకార్య క్రమంలో పలువురు గౌడ సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత

రాయికల్, జనవరి 27: మండలంలోని ఇటిక్యాల ఉన్నత పాఠశాలకు సాయప్ప ఛారిటబుల్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ హిమవంత రావు కంప్యూటర్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శనివారం ప్రధానోపాధ్యాయులు సదా శివ్, మాజీ సర్పంచ్ నీరటి శ్రీనివాస్‌లకు కంప్యూటర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు వేణు, చంద్రకంటి రవీందర్, పాఠశాల ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వర శర్మ, ఎద్దండి రమేష్, శాంతకుమారి, జియావొద్దీన్, హన్మంత రావు పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్‌కు ప్రశంసా పత్రం అందజేత

జగిత్యాలరూరల్, జనవరి 27 : జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోళి శ్రీలతకు ఉత్తమ సేవలకుగాను ప్రశంస పత్రాన్ని అందించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా టీఎస్‌డబ్ల్యూ ఆర్ఈఐఎస్ సెక్రటరీ డాక్టర్ నవీన్ నికోలస్, అడిషనల్ సెక్రటరీ హనుమంతునాయక్, జాయింట్ సెక్రటరీ నీరూ పచేతులమీదుగా హైద్రాబాద్‌లో ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ప్రిన్సిపల్ ను అభినందించారు.

సైన్స్ చెకుముకి పరీక్ష

కథలాపూర్, జనవరి 27 : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో మండల స్థాయి సైన్స్ చెకుముకి పరీక్ష నిర్వహించారు. 8,9,10వ తరగతికి చెందిన విద్యార్థులు సుమారు 30 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో ఆనంద రావు మాట్లాడుతూ విజ్ఞానంతోనే జగత్తు వికసిస్తుందని అందువల్ల సైన్స్‌ను నమ్మాలని వివరించారు. కథలాపూర్ జిల్లా పరిషత్‌కు చెందిన వైష్ణవి, రుతిక, ఆదిత్యలు విజేతలుగా నిలిచారు. వీరికి ప్రశంసా పత్రం, బహుమతు లను ప్రదానం చేశారు. విజేతలు ఫిబ్రవరి 2న జరిగే జిల్లా స్థాయి పోటీలకు హాజరుకావాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా మండల బాధ్యులు శ్రీనివాస్, పరీక్షల నిర్వాహణ బాధ్యులు ఖలీద్‌పాషా, వేముల శ్రీనివాస్ ఉన్నారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మహాలక్ష్మి జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైనట్లు శనివారం ప్రిన్సిపాల్ సంగనభట్ల రవీందర్ తెలిపారు. జన విజ్ఞాన సమితి జిల్లా శాఖ వారు చెకుముకి పోటీలను మండల స్థాయిలో నిర్వహించారు. జరిగిన పోటీల్లో మహాలక్ష్మి మంచి ప్రతిభ కనబర చడంతో ఆమెకు ప్రశంసాప్రతం అందజేశారు. జిల్లా స్థాయిలో నిర్వహించే చెకుముకి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవింధర్, జగదీశ్వర్, చంద్రయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

కోరుట్ల, జనవరి 27 : వాహనాలు నడిపే వారు ట్రాఫిక్ నియమాలు పాటించి వాహనాలు నడుపాలని ఎస్ఐ కిరణ్ కుమార్ అన్నారు శనివారం పట్టణంలోని పీఆర్‌బీఎం జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రత్త వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. ట్రాఫిక్ సిగ్నల్ ఉన్న కూడలీలో నిబంధనలు పాటించాలని ఎదుటి వారి భద్రతను దృష్టిలో ఉంచుకోని వాహనాలు నడుపాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాడెంగ్ పోతని ప్రవీణ్ కుమార్‌లతో పాటు విద్యార్థులు, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

పెగడపల్లి, జనవరి 27 : గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని ఎస్టీ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షులు నగావత్ జీవన్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గిరిజన జాతి సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడానికి గిరిజన మేదావులు, ప్రజాప్రతినిధులు, విద్యావంతులందరం కలసి ఉద్యమించి సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 15 ను సెలవుదినంగా సాధించుకుందామన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు.

ఉప సర్పంచ్‌పై వీగిన అవిశ్వాసం

కొడిమ్యాల, జనవరి 27 : మండలంలోని చెప్యాల గ్రామ ఉపసర్పంచు గుంటి ఎల్లయ్యపై పంచాయతీ సభ్యులు పెట్టిన అవిశ్వాసం శనివారం వీగింది. జగిత్యాల ఆర్డీవో కె. నర్సింహమూర్తి సమక్షంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించగా 12 మంది పంచాయతీ సభ్యులలో 8 మంది హాజరు కావాలిసి ఉండగా అయిదుగురు మాత్రమే హాజరైనందున అవిశ్వాసం వీగింది. ఈ సమావేశంలో తహసీల్దార్ రవికాంత్, ఎంపీవో ప్రవీణ్, రెవెన్యూ పరిశీలకుడు రవీందర్, గ్రామ సర్పంచు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.